ఫ్లై ఓవర్ నిర్మాణం ఎప్పుడో..?



డెయిరీఫారం నుంచి హనుమంతవాక కూడలి వరకు నిలిచిపోయిన వాహనాలు



వెంకోజీపాలెం నుంచి హనుమంతవాక కూడలి వరకు నిలిచిన వాహనాలు

- గజిబిజిగా హనుమంతవాక కూడలి
- బస్సులు, లారీలు, వేలాది కార్లతో నిత్యం రద్దీ
- జంక్షన్ దాటాలంటే హడలిపోతున్న వాహనచోదకులు
- ఫ్లై వంతెన నిర్మించాలని కొన్నేళ్లుగా ప్రజల డిమాండ్
- ఆ ప్రతిపాదన ఊసెత్తని పాలకులు, అధికారులు

ఆరిలోవ : హనుమంతవాక కూడలి గజిబిజిగా మారుతోంది. నగరంలో వాహనాల వినియోగం పెరగడంతోపాటు జాతీయ రహదారి కావడంతో ఆర్టీసీ సిటీ బస్‌లు, లైన్ బస్‌లు, లారీలు, కార్లుతో నిత్యం రద్దీగా మారింది. ఈ కూడలి దాటాలంటే వాహనచోదకులకు, పాదచారులకు సవాల్‌గా మారింది. హనుమంతవాక కూడలి వద్ద ఫ్లై ఓవర్ నిర్మించాలని నగర వాసులు కొన్నేళ్లుగా కోరుకుంటున్నారు. నిత్యం బిజీగా ఉండే ఈ కూడలి వద్ద వాహనాల రద్దీని నియంత్రించడానికి ఫ్లై ఓవర్ ఎంతో అవసరం. ఎన్ని ప్రభుత్వాలు మారినా ఇక్కడ ఫ్లై ఓవర్ నిర్మాణం విషయం కలగా మారిపోయిందంటూ స్థానికులు, వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీరి కల ఎప్పటికి నెరవేరుతుందో ప్రశ్నార్థకంగా మారింది. వాహనాలు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయి. ఇక్కడ వాహనాలు రద్దీ పెరుగుతున్నా, ప్రభుత్వాలు మారుతున్నా ఫ్లై ఓవర్ నిర్మాణంపై పాలకులు, అధికారులు ఇంతవరకు చర్యలు చేట్టలేదు. దీంతో ఇది నెరవేరని కలగా మిగిలిపోతోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నుంచి 2023లో ఇక్కడ ఫ్లై ఓవర్ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ వచ్చినా ఆ ప్రతిపాదనలను అధికారులు మరుగున పడేశారు. 2024లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆ ప్రతిపాదన ఊసే లేకుండా పోయింది. ఇక్కడ ఫ్లై ఓవర్ నిర్మించాలని కోరుతూ ధర్నాలు, నిరసనలు కూడా జరుగుతున్నాయి. ఇటీవల విశాఖపట్నం అపార్ట్‌మెంట్స్ రెసిడెంట్స్ అసోసియేషన్, గ్రేటర్ విశాఖ రెసిడెంట్ కాలనీ అసోసియేషన్స్ (వారా నివాస్) నివాస్ ఆధ్వర్యంలో హనుమంతవాక వద్ద ఫ్లై ఓవర్ నిర్మించాలని కోరుతూ ధర్నా చేపట్టిన విషయం తెలిసిందే.



హనుమంతవాక కూడలి వద్ద వాహనాల రద్దీ

వాహనాల గజిబిజితో ప్రమాదాలు

హనుమంతవాక కూడలి దాటే సమయంలో వాహనాల గజిబిజితో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. రోడ్డు దాటుతున్న పాదచారులను వాహనాలు ఢీకొనడం, ముందు, వెనుక వెళ్లే వాహనాలు ఒకదానినొకటి ఢీకొట్టుకొంటున్నాయి.

- ఐదేళ్ల క్రితం మధురవాడ వైపు నుంచి వస్తూ సిగ్నల్ పడటంతో ఆగి ఉన్న ద్విచక్ర వాహనాలపైకి ఒడిశా నుంచి వస్తున్న ఓ లారీ దూసుకుపోయింది. ఈ దుర్ఘటనలో సంఘటనా స్థలంలోనే నలుగురు ప్రాణాలు పోగొట్టుకొన్నారు.
- గత ఏడాది ఆర్టీసీ బస్ దూసుకుపోయి ఇద్దరు ద్విచక్ర వాహనచోదకులు మృతి చెందారు.
- 2023 డిసెంబర్ 31 రాత్రి 11 గంటల సమయంలో రోడ్డు దాటుతున్న ఓ యువతిని లారీ ఢీకొనడటంతో మృతి చెందింది.
- ఈ కూడలిలో 10 ఏళ్లలో సుమారు 15 మందికిపైగా మృతి చెందారని ట్రాఫిక్ పోలీసులు చెబుతున్నారు. ఇక్కడ ఫ్లై ఓవర్ నిర్మిస్తే రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ కష్టాలు తీరుతాయని ప్రజలు, పోలీసులు అభిప్రాయ పడుతున్నారు.



ఫ్లై ఓవర్ నిర్మించాలని ఇటీవల ధర్నా చేపట్టిన వార్వా నివాస్ ప్రతినిధులు

వేలాది వాహనాల రాకపోకలతో గందరగోళం

హనుమంతవాక కూడలి వాహనాలతో నిత్యం రద్దీగా ఉంటుంది. రెండేళ్లుగా ఈ రద్దీ మరింత పెరిగింది. ఈ కూడలి నిత్యం వాహనాల రాకపోకలతో బిజీబిజీగా ఉంటుంది. ఈ రహదారిలో వాహనాలు పెరగడమే ఇక్కడ రద్దీకి కారణమంటూ ట్రాఫిక్ పోలీసులు అంటున్నారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి జాతీయ రహదారి మీదుగా నగరానికి ఆర్టీసీ బస్‌లు, ట్రావెల్ బస్‌లు, పాఠశాలలు, కళాశాలల బస్‌లు నిరంతరం తిరుగుతుంటాయి. ఒడిశా నుంచి లారీలు, కార్లు, ట్రావెల్ బస్‌లు ఇదే కూడలి మీదుగా ప్రయాణిస్తున్నాయి. దానికితోడు హనుమంతవాక నుంచి సింహాచలం, వేపగుంట వరకు బీఆర్‌టీఎస్ రోడ్డు నిర్మాణం జరగడంతో గోపాలపట్నం, పెందుర్తి ప్రాంతాల నుంచి నగరానికి వెళ్లే వారు ఈ కూడలి మీదుగానే ప్రయాణిస్తున్నారు. దీంతోపాటు రుషికొండ, కైలాసగిరి నుంచి విశాలాక్షినగర్ మీదుగా హనుమంతవాక వైపు వాహనచోదకులు వస్తుంటారు. వీరందరితోపాటు ఆరిలోవ, ఆదర్శనగర్, డెయిరీఫారం ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వాహనచోదకులు తిరుగుతుంటారు. ఆయా మార్గాల ద్వారా తిరిగే వాహనచోదకులతో నిత్యం ఈ కూడలి రద్దీగా మారుతుంది. ప్రధాన రహదారిపై ఉదయం 7.30 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కూడలి నుంచి ఇటు వెంకోజీపాలెం వరకు, అటు డెయిరీఫారం వరకు వాహనాలు బారులు తీరుతున్నాయి. ఉదయం సమయంలో ఈ కూడలి నుంచి బీఆర్‌టీఎస్‌లో ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి దాటి విమ్స్ వెనుక ద్వారం వరకు వాహనాలు నిలిచిపోతున్నాయి. ఆయా లైన్‌ల నుంచి హనుమంతవాక కూడలి దాటడానికి వాహనచోదకులకు కనీసం రెండు సిగ్నిల్స్ పడుతున్నాయంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.



హనుమంతవాక కూడలి నుంచి ఆరిలోవ, సింహాచలం వైపు బారులు తీరిన వాహనాలు

ఫ్లై ఓవర్ చాలా అవసరం



ఇక్కడ రెండు కొండల మధ్య ఉన్న జాతీయ రహదారి మీదుగా నగరంలోకి వెళ్లాలి. ప్రత్యామ్నాయ మార్గాలు కూడా లేవు. ఇక్కడ ఒకటే దారి కావడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో గంటల తరబడి వాహనాలు బారులు తీరుతున్నాయి. ఈ కూడలి దాటాలంటే రెండు సిగ్నల్స్ క్లియర్ అయ్యేంత వరకు వేచి ఉండాల్సి వస్తోంది. ఈ సమస్య పరిష్కారానికి ఫ్లైఓవర్ చాలా అవసరం. ఎన్ని ప్రభుత్వాలు మారినా ఇక్కడ ఫ్లై ఓవర్ నిర్మాణం గురించి ఆలోచించకపోవడం బాధాకరం. – కె.చిరంజీవి, ఆరిలోవ

ఎవరూ పట్టించుకోవడం లేదు



హనుమంతవాక కూడలి వద్ద ఫ్లై ఓవర్ నిర్మించేందుకు అధికారులు ప్రతిపాదనలు చేయాలి. కొన్నేళ్లుగా ప్రజలు ఫ్లై ఓవర్ నిర్మాణం కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. అయినా ఏ ప్రభుత్వమూ ఇంత వరకు ఇక్కడ ఫ్లై ఓవర్ నిర్మించలేదు. ఇక్కడ ఫ్లై ఓవర్ నిర్మాణం జరిగితే ట్రాఫిక్ కష్టాలు తీరడంతో పాటు రోడ్డు ప్రమాదాలకు కూడా అడ్డుకట్ట పడుతుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు ఆ దిశగా దృష్టి సారించాలి. – నీరజ్‌కుమార్, విశాలాక్షినగర్

క్లుప్తంగా

అధ్యాపకులు పుస్తకాలు రచించాలి



పుస్తకం ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ విజయబాబు, తదితరులు

మద్దిలపాలెం : అధ్యాపకులు మంచి పుస్తకాలు రచించాలని భీమిలి ఎస్‌వీఎల్ఎన్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ సూచించారు. ఆ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ విష్ణుమూర్తి రచించిన ×వుమెన్ ఎంపవర్‌మెంట్ త్రూ సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్‌ ≈ అనే పుస్తకాన్ని మద్దిలపాలెంలోని డాక్టర్ వి.ఎస్.క్రిష్ణా కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ పి.ఉమామహేశ్వరరావు, డాక్టర్ జి.లక్ష్మణరావు, డాక్టర్ ఎ.వి.రమేష్ తదితరులు పుస్తక రచయిత విష్ణుమూర్తిని అభినందించారు.

డివైడర్ పైకి దూసుకుపోయిన లారీ



ముడసర్లోవ వద్ద డివైడర్ పైకి దూసుకుపోయిన లారీ

ఆరిలోవ : బీఆర్‌టీఎస్‌లో మితిమీరిన వేగంతో వెళ్తున్న ఓ లారీ డివైడర్‌పైకి దూసుకుపోయింది. ఆ సమయంలో రోడ్డుపై ఇతర వాహనాల రద్దీ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. సోమవారం ఉదయం ఓ లారీ బీఆర్‌టీఎస్‌లో సింహాచలం నుంచి హనుమంతవాక వైపు వెళ్తోంది. అతి వేగంతో వెళ్తున్న లారీకి రామకృష్ణాపురం కూడలి దాటిన తర్వాత బ్రేకులు విఫలమయ్యాయి. దీంతో డ్రైవర్ ఆ లారీని అదుపు చేసే క్రమంలో ముడసర్లోవ పార్కు సమీపంలో డివైడర్ పైకి ఎక్కించేశాడు. దీంతో డివైడర్ దాటి పక్క లైన్‌లోకి రెండు టైర్లు వెళ్లిపోయాయి. డివైడర్ మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి ఆ లారీ నిలిచిపోయింది. లారీ ఢీకొట్టడంతో విద్యుత్ స్తంభం విరిగిపోయి నేలకూలింది. విషయం తెలుసుకున్న ట్రాఫిక్ పోలీసులు లారీని, విరిగిన విద్యుత్ స్తంభాన్ని రోడ్డు పక్కకు జరిపించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



ఆరిలోవ : జోడుగుళ్లపాలెం సుముద్ర తీరానికి గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం సోమవారం కొట్టుకువచ్చింది. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న ఆరిలోవ పోలీసులు జోడుగుళ్లపాలెం తీరానికి చేరుకుని పరిశీలించారు. ఆధారాలు లభ్యం కాకపోవడంతో గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేసి కేజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుని వయసు సుమారు 55 సంవత్సరాలు ఉంటాయని పోలీసులు భావిస్తున్నారు. బంధువులు ఎవరైనా ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

కరకచెట్టు పోలమాంబ హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

బీచ్‌రోడ్డు : పెదవాల్తేరులో వేంచేసిన కరకచెట్టు పోలమాంబ ఆలయ హుండీ ఆదాయం సోమవారం లెక్కించారు. 87 రోజులకు రూ.11,32,693 ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో గాయత్రి తెలిపారు. దేవదాయ శాఖ పర్యవేక్షణ అధికారిగా డి.వి.ఎస్.సురేష్ బాబా వ్యవహరించారని తెలిపారు. కార్యక్రమంలో పెదవాల్తేరు గ్రామ సేవా సంఘం అధ్యక్షుడు బి.తవిటి రెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.

సింహగిరిపై ఏకాదశి తిరువీధి

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని సింహగిరిపై సోమవారం సాయంత్రం మదనగోపాలస్వామి ఉత్సవమూర్తులకు విశేషంగా తిరువీధి నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులను అలంకరించి పల్లకిలో వేంజేపచేశారు. ఆలయ బేడామండపంలో తిరువీధి ఘనంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున హారతులు అందించారు. భక్తులు స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు.

కార్పొరేటర్ మూర్తి యాదవ్‌పై ఫిర్యాదు

కాలువ నిర్మాణంలో వివక్ష చూపిస్తున్నారని రజకవీధి వాసుల ఆగ్రహం

మద్దిలపాలెం : కాలువ నిర్మాణంలో భాగంగా జీవీఎంసీ 22వ వార్డు పితాపురం కాలనీలో స్థానిక కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్, అధికారులు చేసిన విధ్వంసంపై ఇప్పటికే స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ విమర్శలు గుప్పిస్తున్న విషయం తెలిసిందే. మరోవైపు ఇక్కడి రజకవీధి కాలనీకి కాలువ నిర్మాణంలో వివక్ష చూపిస్తున్నారని జీవీఎంసీ కమిషనర్‌కు స్థానికులు ఫిర్యాదు చేశారు. ఇక్కడి కూరగాయల మార్కెట్‌కు ఎదురుగా ఉన్న రజకవీధి రోడ్డును పనులు ప్రారంభం రోజే ముందుగా తవ్వేశారు. అనంతరం అక్కడక్కడ పనులు చేపట్టిన తర్వాత కాలనీ రోడ్డు వరకూ నిర్మాణాలు చేశారు. కానీ కాలనీకి వెళ్లే మార్గంలో మాత్రం పనులు చేయకుండా వదిలేశారు. దీంతో కాలనీ వాసులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఇదే కాలనీలో వాటర్ ట్యాంక్ కూల్చేందుకు జేసీబీతో ప్రయత్నిస్తే అప్పట్లో కాలనీవాసులు అడ్డుకున్నారు. అప్పుడు నెలకొన్న వివాదాన్ని మనసులో పెట్టుకుని, ఇప్పుడు కాలువ నిర్మించకుండా వివక్ష చూపిస్తున్నారని కాలనీవాసులు కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్, అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయమై జీవీఎంసీలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కమిషనర్ కేతన్‌గార్గ్‌కు రజకవీధి కాలనీకి చెందిన దేవర శంకర్ ఫిర్యాదు చేశారు. రజకవీధిలో 9 – 5 – 5/1 ఇంటి వద్ద కాలువ కోసం తవ్విన గోతులపై త్వరగా నిర్మాణాలు చేపట్టాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.



తవ్వి వదిలేసిన రజక వీధి రోడ్డు

వివాదాస్పదంగా కార్పొరేటర్ వైఖరి

జీవీఎంసీ జోన్ – 3లో 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ వైఖరిపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. రాష్ట్రంలో ఎక్కడ ఏం జరిగినా ఊకదంపుడు ఆరోపణలు చేసే ఈ కార్పొరేటర్ సొంత వార్డులో మాత్రం అభివృద్ధి పేరుతో విధ్వంసం చేస్తున్నారని మండిపడుతున్నారు. ఇప్పటికే పితాపురం కాలనీలోని పార్కు ఆధునికీకరణ విషయంలో చేసిన తప్పిదాలపై కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కోర్టుకు వెళ్లిన విషయం తెలిసిందే. మరోవైపు రోడ్డు పక్కన వ్యాపారాలు చేసుకుని జీవించే చిరు వ్యాపారుల దుకాణాలు తొలగించి వారి పొట్ట కొట్టారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా కాలువ నిర్మాణం పేరుతో సుమారు 40 ఏళ్లుగా పితాపురం కాలనీ వాసులకు నీడనిస్తున్న చెట్లను తెగనరికించేశారని స్థానికులు మండిపడుతున్నారు. పచ్చదనంపై వేటు వేయడంతో కార్పొరేటర్ మూర్తి యాదవ్ తీరుపై ప్రకృతి ప్రేమికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వార్డులో నియంతృత్వ వైఖరి ప్రదర్శిస్తున్నారని... అభివృద్ధి పనుల కోసమని రూ.11.5 కోట్లు మంజూరైతే వాటితో ఏ పనులు చేశారో తెలియడం లేదని... రోడ్లన్నీ అస్తవ్యస్తంగా ఉన్నాయని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు.

క్లాప్ వాహనాల డ్రైవర్లు, లోడర్ల ఆందోళన



ఆందోళనలో పాల్గొన్న క్లాప్ వాహనాల డ్రైవర్లు, లోడర్లు

గాజువాక: జీవీఎంసీ గాజువాక జోన్ క్లాప్ వాహనాల డ్రైవర్లు, లోడర్లు సోమవారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా చెత్త సేకరణ వాహనాలను నిలిపివేశారు. తమకు రావాల్సిన జీతాలను చెల్లించకుండా కాంట్రాక్టర్ మాయమాటలతో కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ప్రధాన కార్యదర్శి గొలగాని అప్పారావు మాట్లాడుతూ ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించడంలేదని, కార్మికులు పని ప్రదేశంలో ప్రమాదాలకు గురైనా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతినెలా జీతంలో కోత పెడుతున్నారని, చేతికి రూ.8 వేలు దాటి రావడంలేదన్నారు. వడదెబ్బతో డ్యూటీలో మృతి చెందిన లోడర్ గంగాభవాని కుటుంబ సభ్యులకు ఇచ్చిన రూ.2.50 లక్షల చెక్కు చెల్లలేదని పేర్కొన్నారు. ప్రతినెలా డ్రైవర్లు, లోడర్లు ఆందోళన చేస్తే తప్ప జీతం చెల్లించకపోవడం దారుణమన్నారు. ఇది ప్రభుత్వానికి సిగ్గు చేటని, ఈ పద్ధతిని వెంటనే మార్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎం.రాంబాబు, నక్క నాగరాజు, ధనరాజు, చంటి, మహేష్, లక్ష్మి, కనక తదితరులు పాల్గొన్నారు.

‘శ్రీపద సంకీర్తన’ పుస్తకావిష్కరణ

సీతంపేట: రాజయోగి వెంకటపతి స్వామి రచించిన ‘శ్రీపద సంకీర్తన’ పుస్తకావిష్కరణ కార్యక్రమం సోమవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. సహృదయ సాహితి, శ్రీజగత్కల్యాణ పీఠం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంగీత విద్వాంసుడు డాక్టర్ ద్వారం వి.కె.జి.త్యాగరాజు చేతుల మీదుగా పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కావ్యాలు మూడు రకాలని, నారికేళ పాకం, కదళీ పాకం, ద్రాక్ష పాకంలతో పోల్చారు. పుస్తక రచయిత వెంకటపతి స్వామిని కొనియాడారు. ద్వారం మ్యూజిక్ అకాడమీ త్యాగరాజ శిష్య బృందంచే కనకమహాలక్ష్మి సంకీర్తన గానలహరి అలరించింది. మరడాన నాగేశ్వరరావు, డి.వి.సూర్యారావు, శేఖరమంత్రి ప్రభాకర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ మోసాలను ప్రజలకు వివరించండి



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు

వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు

ఎంవీపీ కాలనీ : ఎన్నికల మేనిఫెస్టో అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని గడప గడపకూ వెళ్లి ప్రజలకు వివరించాలని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు కార్యకర్తలకు సూచించారు. జీవీఎంసీ 17వ వార్డులో సోమవారం నిర్వహించిన ×బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ≈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలు నెరవేర్చడంలో విఫలమైందన్నారు. ఓటర్లను మోసం చేసి అడ్డదారిలో గద్దెనెక్కేందుకే ఎన్నికల సమయంలో ఆచరణ సాధ్యం కాని మోసపూరిత హామీలిచ్చారని ఆరోపించారు. ఆ హామీలను నెరవేర్చకుంటే ఊరుకునేది లేదంటూ కూటమి నాయకులను ప్రజలు నిలదీయాలని పేర్కొన్నారు. ఎన్నికల్లో చేసిన మోసపూరిత హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ కూటమి నాయకులను ప్రజా కార్యక్రమాల్లో అడ్డుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముమ్మల సురేష్, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, జిల్లా వలంటీర్ విభాగం అధ్యక్షుడు పీలా ప్రేమ్‌కిరణ్, గణేష్‌రెడ్డి, కుమార్ రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, లక్ష్మణ్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక భవనంతో వ్యాపారం చేస్తున్నారు

ఆరిలోవ : జీవీఎంసీ పదో వార్డు శాంతినగర్‌లోని జీవీఎంసీ సామాజిక భవనాన్ని పదకొండో వార్డు పరిధి గాంధీనగర్‌కు చెందిన కొందరు రాజకీయ నాయకులు వ్యాపారం కోసం వినియోగించుకొంటున్నారని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌కు శాంతినగర్ గ్రామాభ్యుదయ సేవా సంఘం అధ్యక్షుడు ఒమ్మి శ్రీను సోమవారం గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్జీ పెట్టుకోగా జీవీఎంసీ నిధులతో అధికారులు శాంతినగర్ ప్రజల కోసం సామాజిక భవనం నిర్మించారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ భవనాన్ని కొన్నాళ్ల క్రితం గాంధీనగర్‌కు చెందిన కొందరు రాజకీయ నాయకులు గాంధీనగర్ సామాజిక భవనం అని బోర్డు ఏర్పాటు చేసి ఫంక్షన్లు చేసే వారి నుంచి రూ.20 వేలు చొప్పున అద్దె వసూలు చేస్తున్నారని ఫిర్యాదులో తెలిపారు. జీవీఎంసీకి చెందాల్సిన ఆ డబ్బులను కూడా వారి గ్రామ సంఘం పేరుతో వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఎక్కువ మొత్తం కావడంతో పేదలకు ఆ సామాజిక భవనం అందుబాటులో లేకుండా పోయిందని ఫిర్యాదులో వివరించారు. సామాజిక భవనం శాంతినగర్ పేరుతో పేదలకు అందుబాటులో ఉండేవిధంగా చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై స్పందించిన కమిషనర్ పరిశీలించి చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు ఒమ్మి శ్రీను తెలిపారు.



జీవీఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న శాంతినగర్ సేవా సంఘం అధ్యక్షుడు ఒమ్మి శ్రీను

పనిచేయలేకున్నాం.. భారం తగ్గించండి..!

- ఒకే సమాచారం రెండు యాప్‌లలో నమోదుతో అవస్థలు
- పీడీ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీల నిరసన

ఎంవీపీకాలనీ : ఒకే సమాచారాన్ని రెండు యాప్‌ల్లో నమోదు చేయడం వల్ల పనిభారం పెరుగుతుందని అంగన్‌వాడీలు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీలోని శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకురాలు మణి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అంగన్‌వాడీలకు పనిభారం పెరిగిందన్నారు. ఫేస్ రికగ్నేషన్ సిస్టమ్ తప్పనిసరి చేయడంతో పాటు విద్యార్థుల హాజరు, ఫొటో అప్‌లోడ్‌తో పాటు అనేక వివరాలు బాల సంజీవని, పోషణ ట్రెకర్ యాప్‌ల్లో ఒకే సారి చేయాల్సి వస్తోందన్నారు. బాలింతలు, గర్భిణులు సరకుల పంపిణీ కూడా ఓటీపీ, ఈకేవైసీ విధానంలో యాప్‌లో నమోదు చేస్తున్నారన్నారు. దీంతో అంగన్‌వాడీలపై తీవ్ర పనిభారం పెరిగిందన్నారు. పిల్లల పోషణపై దృష్టిపెట్టడం కన్నా యాప్‌ల్లో సమాచారం నమోదు చేయడానికే అష్టకష్టాలు పడాల్సిన పరిస్థితి వస్తోందని వాపోయారు. ఫోన్లు సైతం సక్రమంగా పనిచేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తక్షణమే ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని రద్దు చేయాలని, వేతనాలను రూ.26,000కు పెంచాలని, అంగన్‌వాడీల పిల్లలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, కొత్త సెల్‌ఫోన్లు అందజేయాలని, ఒక్కరోజు సెలవుకే సీడీపీవో పర్మిషన్ తీసుకొనే విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు వినతిపత్రాన్ని ఐసీడీఎస్ నోడల్ ఆఫీసర్ ఝాన్సీరాణికి అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు కె.వెంకటలక్ష్మి, కార్యదర్శి దేవి తదితరులు పాల్గొన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వందల మంది అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.



ఐసీడీఎస్ నోడల్ ఆఫీసర్ ఝాన్సీరాణికి వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ఆన్‌లైన్ విధానాన్ని నియంత్రించాలి



అంగన్‌వాడీలకు సౌకర్యాలు కల్పించడంతో పాటు పూర్తి ఆన్‌లైన్ విధానాన్ని సవరించాలి. సమయమంతా ఆయా యాప్‌ల్లో వివరాల నమోదుకే సరిపోతోంది. దీని ప్రభావం స్కూల్ బలోపేతంపైన, విద్యార్థుల అభివృద్ధిపైన పడుతోంది. రానున్న రోజుల్లో అంగన్‌వాడీ సెంటర్లలో పిల్లల సంఖ్య తగ్గిపోయే ప్రమాదం ఉంది. – కె.వెంకటలక్ష్మి, సంఘం జిల్లా గౌరవ అధ్యక్షురాలు

ఒకే యాప్ తీసుకురావాలి



ప్రతిరోజు అంగన్‌వాడీలు రెండు యాప్‌ల్లో వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. ఒకే సమాచారాన్ని రెండు యాప్‌ల్లో నమోదు చేయడం వల్ల సమయం వృథా అవుతోంది. ప్రభుత్వం ఇచ్చిన ఫోన్స్ పని చేయకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఒకే యాప్ అందుబాటులోకి తీసుకురావాలి. – తులసి, అంగన్‌వాడీ టీచర్

ఉపాధి కల్పించాలని ఉక్కు నిర్వాసితుల ఆందోళన



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న స్టీల్ ప్లాంట్ నిర్వాసితులు

బీచ్‌రోడ్డు : విశాఖ స్టీల్ ప్లాంట్ నిర్మాణం కోసం భూములు, ఇళ్లు కోల్పోయి 45 ఏళ్లు గడుస్తున్నా ఇంకా 8500 మంది ఆర్ కార్డుదారులకు శాశ్వత పరిష్కారం చూపించలేదని నిర్వాసితులు వాపోయారు. ఈ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం పెట్టుబడుల ఉపసంహరణ పేరుతో స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయడానికి జారీ చేసిన ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని 14 నెలలుగా పోరాటం చేస్తున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ వారంతా సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్మికులను తగ్గించాలనే ఆలోచనతో స్టీల్ ప్లాంట్‌లో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న నిర్వాసితులను వైద్యపరీక్షల పేరుతో తొలగిస్తున్నారని ఆరోపించారు. ఆర్ నంబర్ ఉన్న వారికి ఉద్యోగం కల్పించాల్సిన బాధ్యత స్టీల్ ప్లాంట్‌పై ఉన్నా 8 సంవత్సరాల నుంచి ఒక్క నోటిఫికేషన్ కూడా తీయలేదన్నారు. కార్యక్రమంలో పితాన భాస్కరరావు, ఎన్. ప్రసాద్, వంశీకృష్ణ, కె. గణేష్, రాంబాబు, ముసలి నాయుడు తదితరులు పాల్గొన్నారు.